క్లుప్తంగా

ఇంకొల్లు తహసీల్దార్‌గా వెంకటరత్నం


వెంకట రత్నం

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు తహసీల్దార్‌గా శింగంశెట్టి వెంకటరత్నం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రమీల బదిలీ కాగా ఆమె స్థానంలో వెంకటరత్నం వచ్చి చేరారు. గతంలో కర్లపాలెం తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చి చేరారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరని లోటు

అద్దంకి: రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికి తీరనిలోటని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకర్‌రావు ఒక ప్రకనలో కొనియాడారు. ఆయన తాను సంపాదించిన సంపాదనలో ఎక్కువ భాగం దేశ ప్రజల కోసం ఖర్చు చేశారని చెప్పారు. విలువలతో కూడిన పారిశ్రామిక వేత్తని, భారత ప్రభుత్వం కూడా పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించిందని గుర్తు చేసుకున్నారు. టాటా మృతికి తమప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సంతాపం తెలియజేసిన వారిలో ట్రెజరర్ మల్లాది శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు ఉన్నారు.

భూములకు రక్షణ కల్పించాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

చీరాల రూరల్: రెవెన్యూ డివిజన్‌లోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల భూములను ఆక్రమించినవారిపై చర్యలు తీసుకొని ఆయా భూములకు రక్షణ కల్పించాలని దళిత సంఘాల నాయకులు ఆర్డీవోకు వినతి అందించారు. దళిత సంఘాల నాయకులు గురువారం ఆర్డీవో అఖిలను కలసి ఎస్సీ, ఎస్టీల భూములు, అట్రాసిటీ కేసులలో పురోగతి వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొంతమంది తహశీల్దార్‌లు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సకాలంలో రిపోర్టులు పంపకపోవడంతో కేసులలో జాప్యం ఏర్పడుతుందని, తద్వారా బాధితులకు ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారం కూడా ఆలస్యమవుతుందని ఆర్డీవోకు వివరించారు. కారంచేడు మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేసి ఇచ్చిన భూములను ప్రభుత్వం రుణమాఫీ చేసి బాధితులకు భూ హక్కు కల్పించాల్సి ఉందని, కానీ కారంచేడు తహశీల్దార్ ఆయా భూములను ఆన్‌లైన్ చేయకుండా 12 మంది దళిత బాధితులను వేధింపులకు గురిచేస్తున్నారని వివరించారు. అయితే ఈ భూముల విషయంలో జిల్లా కలెక్టర్ తహశీల్దార్‌కు ఫోన్‌చేసి ఈ భూములను ఎందుకు ఆన్‌లైన్ చేయలేదో రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్లు నాయకులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవోను కలసిన వారిలో దళిత నాయకులు నీలం నాగేంద్రం, మాచవరపు జూలియన్, గంట సుబ్బారావు, సృజన్, గోసాల అశోక్, కాకుమాను రవి, తదితరులు ఉన్నారు.

అమ్మవారికి 53 కేజీల లడ్డూ అందజేత

అద్దంకి రూరల్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం 53వ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి అద్దంకికి చెందిన ఊటుకూరి సుబ్బరామయ్య బ్రదర్స్ 53 కేజీల లడ్డును అందజేశారు. అలాగే కొత్తమాసు రూపాస్ 18 కేజీ లడ్డును అందజేశారు.

ప్రయాణం నరకమే !

- అధ్వానంగా మారిన పావులూరు-నాగండ్ల రోడ్డు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- జాతీయ రహదారికి అనుసంధానిస్తే మూడు మండలాలకు మేలు


అధ్వానంగా ఉన్న నాగండ్ల రోడ్డు

ఇంకొల్లు (చినగంజాం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు దాటింది. కనీసం ఒక్కటంటే ఒక్క మంచిపని చేయలేక అన్ని ప్రభుత్వ శాఖలను గాలికొదిలేసింది. మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అని ఊకదంపుడు, అబద్ధపు హామీలతో మోసం చేసి గెలిచారే కాని పనులు మాత్రం పక్కన పెట్టేశారు. ఇంకొల్లు మండలంలోని పావులూరు నుంచి నాగండ్ల వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలమయమై రోడ్డుకిరువైపులా చిల్లచెట్లు పెరిగి ఆ మార్గం గుండా ప్రయాణమంటేనే నరక ప్రాయంగా మారింది. ద్విచక్ర వాహనాలు మొదలు ఇతర వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు ఇబ్బందిగా మారింది. దాదాపు పదేళ్ల క్రితం వేసిన రోడ్డు కావడంతో అది పూర్తిగా దెబ్బతినిపోయింది. ఆ రెండు గ్రామాల మధ్య సుమారు 5 కి.మీ పొడవు రోడ్డు జిల్లా పరిషత్ పరిధిలో ఉండటం వారు పట్టించుకోకపోవడంతో రోడ్డంతా గుంతలమయమై అక్కడక్కడ రాళ్లు లేచి, రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిని అస్తవ్యస్తంగా తయారైంది.

జాతీయ రహదారికి అనుసంధానిస్తే మరింత ఉపయోగం..

పావులూరు నుంచి కోలలపూడి వరకు రోడ్డును మెరుగుపరచి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తే మూడు మండలాల్లోని ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా ఇంకొల్లు మండలంలోని ఎక్కువ గ్రామాలతో పాటు కారంచేడు, మార్టూరు మండలంలోని గ్రామాలకు ఎంతో మేలు జరిగే పరిస్థితి ఉంది. గతంలో స్థానికంగా ట్రంక్ రోడ్డుగా పిలిచే ఈ మార్గం కారంచేడు మండలం దగ్గుబాడు నుంచి ఇంకొల్లు మండలంలోని ప్రధాన గ్రామాలను కలుపుకుంటూ మార్టూరు మండలం కోలలపూడి మీదుగా జాతీయ రహదారి వరకు కొనసాగేది. ఇంకొల్లు నుంచి పావులూరు 3 కి.మీలు అక్కడి నుంచి నాగండ్ల వరకు 5 కి.మీ మార్టూరు మండలంలోని కోలలపూడి మీదుగా జాతీయ రహదారి వరకు 9 కి.మీల మొత్తం 17 కి.మీలు రోడ్డును బాగుపరిస్తే ఇంకొల్లు నుంచి జాతీయ రహదారికి మార్గం సుగమం అవుతుంది.


దెబ్బతిన్న పావులూరు-నాగండ్ల మధ్య రోడ్డు


నాగండ్ల-కోలలపూడి మధ్య రోడ్డు దుస్థితి

రోడ్డుపై ప్రయాణమంటేనే భయమేస్తుంది..



ఇంకొల్లు నుంచి మా నాగండ్ల పంచాయతీలోకి రావాలంటేనే భయమేస్తుంది. రోడ్డు అంతా ఛిద్రమైపోయింది. పగటి పూట ఎలాగోలా కష్టపడి ప్రయాణం చేయగులుగుతున్నాం. రాత్రిళ్ల గ్రామానికి రావాలంటే కష్టంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు విషయం పట్టించుకోవాలి.

– సోమేపల్లి శ్రీనివాసరావు, గ్రామ ఉప సర్పంచ్, నాగండ్ల.

ట్రంక్ రోడ్డును పునరుద్ధరిస్తే బాగుంటుంది..



మూడు మండలాలకు మేలు కలిగించే గతంలోని ట్రంక్ రోడ్డును పునరుద్ధరిస్తే బాగుంటుంది. ప్రస్తుతం పావులూరు నుంచి నాగండ్ల వరకు సుమారు 5 కి.మీలు వకు రోడ్డు అధ్వానంగా ఉంది. రోటరీ సాయంతో గ్రామస్థులమే స్వయంగా మరమ్మతులు చేసుకుంటున్నాం.

– వీరగంధం ఆంజనేయులు, రొటేరియన్, నాగండ్ల

మానసిక ఆరోగ్యంతో ప్రశాంతత


అద్దంకిలో మాట్లాడుతున్న వైద్యాధికారి


చినగంజాంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

అద్దంకి: మానసిక ఆరోగ్యంతో మనిషి ప్రశాంతంగా ఉంటాడని గాజులపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి గొట్టిపాటి జయసింహ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా మండల న్యాయ సేవధికార సంస్థ అద్దంకి ఆధ్వర్యంలో గురువారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ గాజులపాలెంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం ఆరోగ్యం అంటే శారీరక, మానసిక సామాజికపరంగా ఆరోగ్యంగా ఉండటమే నిజమైన ఆరోగ్యం అని తెలియజేశారు. ప్రధానంగా గర్భిణులు కౌమారదశలో ఉన్న బాల బాలికలు, వృద్ధుల మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉంటే సమాజం శాంతి సౌఖ్యాలతో ఆనందంగా ఉంటుందన్నారు కార్యక్రమంలో న్యాయవాదులు, షేక్ మహమ్మద్ రఫీ, ఏం ప్రకాష్ పాల్గొని మానసిక ఆరోగ్య ఆవశ్యకతపై సూచనలు సలహాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: శాంతియుత సమాజ స్థాపన కోసం మానసిక ఆరోగ్యం అవసరం అని చీరాల బార్ అసోసియేషన్ ఏ రామకృష్ణారెడ్డి అన్నారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ఎస్ విజయభాస్కర్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా చీరాల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఏ రామకృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ పీ సాయిశ్రీచరణ్, పారాలీగల్ వలంటీర్ ఎంవీ రామారావు, సామాజిక కార్యకర్త ఎస్టీ మతిన్, హెచ్‌వీ ఉల్దారాణి,హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్‌లు, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తగ్గింపు ధరలకే వంటనూనెలు


నూనె ప్యాకెట్లను ప్రజలకు అందిస్తున్న ఆర్డీవో

చీరాల టౌన్: పెరిగిపోతున్న వంట నూనెల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఆయిల్ డీలర్లతో చర్చించి తగ్గింపు ధరలకే వంట నూనెలను విక్రయిస్తుందని... ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చీరాల ఆర్డీవో డీ అఖిల సూచించారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తగ్గింపు ధరలకే వంట నూనెల విక్రయ కేంద్రాన్ని పట్టణంలోని కార్తికేయ ఆయిల్ ట్రేడర్స్‌లో చీరాల ఆర్డీవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు పెరుగుతున్న వంట నూనెల ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చీరాలలో ప్రత్యేకంగా వంట నూనెల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు పామాయిల్ కిలో రూ.115, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ. 125కే అందిస్తున్నామన్నారు. చీరాల ప్రజలకు అనువుగా మరికొన్ని ప్రత్యేక నూనె విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కుర్రా గోపికృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు నేడే ఆఖరు


నాగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ


భుజంగరావు, ఎక్సైజ్ సీఐ

చీరాల: నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్, వేటపాలెం మండలాల్లోని మొత్తం 19 మద్యం షాపులకు గాను ఇప్పటి వరకు 210 దరఖాస్తులు వచ్చాయని చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. చీరాల పట్టణంలోని 8 షాపులకు 69, చీరాల రూరల్‌లోని 6 షాపులకు 54, వేటపాలెం మండలంలోని 5 షాపులకు 89 దరఖాస్తులు అందాయన్నారు. ఆన్‌లైన్‌లో గురువారం అర్ధరాత్రి వరకు, నేరుగా ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం 7గంటల వరకు దరఖాస్తులను అందించవచ్చన్నారు. మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్చూరు (చినగంజాం): వైన్‌షాపుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే వారు 11 వతేదీ శుక్రవారం రాత్రి 7 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పర్చూరు ఎక్సైజ్ సీఐ ఎం భుజంగరావు తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పర్చూరు ఎక్సైజ్ పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు మండలాల్లోని 15 వైన్‌షాపులకు ఇప్పటి వరకు మొత్తం 336 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. పర్చూరు మండలంలోని 4 షాపులకు 60, యద్దనపూడి మండలంలోని 2 షాపులకు 11, మార్టూరు మండలంలోని 6 షాపులకు 147, ఇంకొల్లు మండలంలోని 3 షాపులకు 118 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు. వీటితో పాటు పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చినగంజాం, కారంచేడు మండలాలు చీరాల సర్కిల్ పరిధిలోనివి కాగా కారంచేడు 2 షాపులకు 41, చినగంజాంలో 3 షాపులకు 25 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు


నాగార్జునకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

చినగంజాం: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జునను చినగంజాం వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన నివాస గృహంలో కలిసిన నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాదర్తి ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ కోమట్ల శివరామరెడ్డి తదితరులున్నారు.

దగ్గుబాడులో నేత్రదానం


బీరం బుల్లెమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): కారంచేడు మండలంలోని దగ్గుబాడు గ్రామానికి చెందిన బీరం బుల్లెమ్మ (91) గురువారం స్వగృహంలో కన్నుమూయడంతో వారి కుటుంబ సభ్యులు అంగీకారం మేరకు ఆమె నేత్రాలను దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. బుల్లెమ్మ కుమారులు శ్రీనివాసరావు, శివరామకృష్ణయ్య, వసుంధర కుటుంబ సభ్యులకు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రఫీ, చుండి సాంబశివరావులు అభినందనలు తెలిపారు.

కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

చీరాల అర్బన్: సీఐటీయూ ఆలిండియా కమిటీ పిలుపు మేరకు జీతాల పెంపు తదితర డిమాండ్లతో తమిళనాడులోని పెరంబుదూర్‌లోని శ్యాంసంగ్ ఇండియా ప్లాంట్‌లోని కార్మికుల పోరాటానికి మద్దతుగా ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ యూనియన్ చీరాల బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ శ్యాంసంగ్ వార్షికాదాయం 12 బిలియన్ డాలర్లు ఉందని, కోట్లాది రూపాయలను కంపెనీకి లాభాలు చేకూరుస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరిని విడనాడి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ

సంతమాగులూరు (అద్దంకి): మండలంలో ఈనెల 14 నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పల్లె పండుగ కార్యక్రమం ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నట్లు ప్రకటనలో తెలిపారు.

రైతుల విజ్ఞానం కోసమే పొలంబడి


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

మార్టూరు: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధించేలా చేయడమే పొలంబడి కార్యక్రమ ఉద్దేశమని మార్టూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం రైతులను సమీకరించి ఖరీఫ్ సీజన్‌లోని పంటలలో ప్రస్తుతం ఎదురవుతున్న చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. పంటలను పరిశీలించిన ఆయన ప్రస్తుతం కాండం తొలిచేపురుగు అధికంగా ఉన్నందున వాటి గుడ్ల నివారణకు 5 శాతం వేప గింజల కషాయం 5 మిల్లీలీటర్లతో పాటు లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్ల ఎసిఫేట్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మాగాణిలో ఉల్లికోడు నివారణకు ఎకరాకు నాలుగు కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కిరణ్ కుమార్, వీపీఏలు గోపి, కిరణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

దుర్గామాతా.. కరుణించమ్మా !

యద్దనపూడి/చినగంజాం/కారంచేడు: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లోక కంటకుడైన దుర్గమాసురుడు అనే రాక్షసుడుని సంహరించింది అష్టమిరోజునే కనుక దుర్గాష్టమి రోజున అమ్మవారిని దర్శించుకోవటం వల్ల దుర్గతులను పోగొట్టి సద్గతులను ప్రసాదిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. మండలంలోని జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళీ, గన్నవరంలోని కాశీ అన్నపూర్ణాదేవి, పూనూరులోని త్రిపుర సుందరీ సమేత త్రిపురాంతకస్వామి ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు.

☆ దేవీ సరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగుతున్నాయి. దసరా నవరాత్రులు పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి గుడి, పెదబజారు శివాలయం, హరేరామ విశిష్ట ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్టమల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, గంగమ్మగుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి దేవస్థానంలోను అమ్మవారిని దుర్గాదేవిగా ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.


కారంచేడు దుర్గామాత ఆలయంలో అమ్మవారి ప్రత్యేక అలంకరణ


దుర్గాదేవి అలంకరణలో జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు


చినగంజాం: రామకోటేశ్వర ఆలయం దుర్గాదేవి అవతారంలో..

☆ చినగంజాం మండలంలోని లలితా రామకోటేశ్వర ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవి అవతారంలో అలంకరించారు. ఉభయ దాతలుగా బలభద్రుని పోలయ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పూజారి శంకర మంచి హనుమంతరావు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

☆ పర్చూరులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని దుర్గాదేవి అలంకారం చేసి అర్చన కైంకర్యాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. దేవదాయ పాలక మండలి అధ్యక్షుడు రావువారి వెంకట శివప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గాదేవిగా అమ్మవారు..

అద్దంకి రూరల్/బల్లికురవ: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజు మండలంలోని దేవాలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగా అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. చెన్నుపల్లి సీతారామస్వామి ఆలయం, గంగా పార్వతి సమేత పరుశవేదీశ్వరస్వామి ఆలయం, కొండాయపాలెం గంగపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, కొణిదెన భవాని సమేత శంకర స్వామి ఆలయం, చిన అంబడిపూడి పార్వతి మల్లేశ్వరస్వామి ఆలయం, కొప్పరపాడు జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయం, స్వామి అమ్మవార్లకు విశిష్ట పూజలు, ప్రత్యేక అలంకరణ చేపడుతున్నారు. రాత్రి హోరాహోరీగా భజనలు జరుగుతున్నాయి.

☆ అద్దంకిలోని వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రం, పాత శివాలయం, వేయిస్తంభాల దేవాలయాల్లోని పార్వతీ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


దుర్గా దేవి అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరీ ..


కారంచేడులో గంగమ్మ గుడిలో దుర్గాదేవిగా అమ్మవారు


పర్చూరులో అమ్మవారిని అలంకరించిన నిర్వాహకులు


చెన్నుపల్లిలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు..